క్లుప్తంగా

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



మల్దకల్: వేసవి సెలువుల్లో నిర్వహిస్తున్న తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం వేసవి తరగతులు ప్రారంభించారు. 6, 7, 8 తరగుతుల విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 15 రోజుల పాటు తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు మొక్కలు, ఎరువుల అందజేత



అయిజ: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేంద్రీస్ సంస్థ నిర్వాహకులు సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో రైతులకు ఉచితంగా పండ్ల మొక్కలు, ఎరువులు పంపిణీ చేశారు. అయిజ, ఇటిక్యాల, గట్టు మండలాలకు చెందిన రైతులు పండ్ల తోటలు సాగుచేసేందుకు ఉచితంగా మొక్కలతో పాటు, సేంద్రీయ, రసాయనాల మందులు, పచ్చిరొట్ట సాగుకు నవధాన్యాల విత్తనాలు అందజేశారు. కార్యక్రమంలో మండల రైతు సంఘం చైర్మన్ సుధాకర్‌గౌడ్, డైరెక్టర్లు వెంకటేష్, హరికృష్ణ, రైతులు పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి



కేటీదొడ్డి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ట్రైనీ ఎస్‌ఐ కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డుకు దరఖాస్తు చేసుకోవాలి

శాంతినగర్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రీ ప్రాజెక్ట్‌లో భాగంగా మంజూరు చేయనున్న ప్రత్యేక గుర్తింపు కార్డుకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి రాధ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వడ్డేపల్లి మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు పాలం పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్ కార్డుకు లింక్ ఉన్న మొబైల్ నంబర్‌తో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను (ఏఈఓలను) సంప్రదించాలని పేర్కొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



మానవపాడు: ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ చంద్రకాంత్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వాహనదారులు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీ.. వ్యక్తికి గాయాలు

ఉండవెల్లి: మండల కేంద్ర శివారు జాతీయ రహదారిపై ట్రాక్టర్ డ్రైవర్‌ను కారు ఢీకొట్టిన ఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. ఇటిక్యాల మండలం యాపదిన్నె గ్రామానికి చెందిన శేఖర్ మొక్కజొన్న లోడ్‌తో వెళ్తున్న సమయంలో కొన్ని సంచులు రహదారిపై జారి పడ్డాయి. ట్రాక్టర్‌లోకి సంచులు ఎత్తుతున్న శేఖర్‌ను కారు ఢీకొట్టింది. ప్రమాదంలో శేఖర్ తలకు, చేతులకు గాయాలవడంతో చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. శేఖర్ కుమారుడు సాయికుమార్ ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ ఎల్లయ్యపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు.

ఆరబోతలు.. పడిగాపులు

- వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల అవస్థలు
- సంచుల కొరతతో తప్పని తిప్పలు
- వెంటాడుతున్న ఈదురు గాలులు, వర్షాల భయం
- అధికారుల అలసత్వంపై అన్నదాతల ఆందోళన



మాన్‌దొడ్డిలోని కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం ఆరబోసిన రైతులు

రాజోళి: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోతలు, రాత్రింబవళ్లు పడిగాపులతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. సంచుల కొరత, ఈదురు గాలులు, అకాల వర్షాలతో అల్లాడుతున్నట్లు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పీఏసీఎస్‌ల ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతుల నుంచి ధాన్యం సేకరణ ప్రారంభించగా మండల పరిధిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అరకొరగా ఉన్న వసతులతో ఇక్కట్లు తప్పడం లేదని పేర్కొన్నారు.

కేంద్రాల వద్ద పడిగాపులు..

మండలంలోని పెద్దధన్వాడ, రాజోళి, మాన్‌దొడ్డి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తమ ధాన్యాన్ని రాశులు పోసుకుని నెల రోజులు కావస్తున్నా కొనుగోలు చేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా దాదాపు 5000 ఎకరాల్లో వరి పంట సాగుచేయగా అధికారులు మాత్రం నిర్లక్ష్యంతో అవస్థలు పడుతున్నట్లు వాపోతున్నారు. ప్రతిరోజు కేంద్రాల వద్ద ధాన్యం కుప్పలు చేసుకుని, కవర్లతో కప్పి పెట్టుకుని, మళ్లీ ఉదయాన్నే ఆరబోసుకోవాల్సి వస్తుందంటున్నారు. ప్రతి రోజూ ఇదే తంతుగా మారిందంటున్నారు.

వేధిస్తున్న సంచుల కొరత..

సంచుల కొరతతో అధికారులు ధాన్యాన్ని ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేపట్టడం లేదని వాపోతున్నారు. మండల అధికారులు వద్ద సరైన అవగాహన లేక, నిర్లక్ష్యం ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. ధాన్యం నింపిన బస్తాలే ఖాళీ అయ్యి మళ్లీ వచ్చే వరకు ఎదురుచూడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోళ్లు ప్రారంభించక ముందే అధికారులు తగిన ఏర్పాటు చేయకుండా



మాన్‌దొడ్డిలో వర్షం భయంతో ధాన్యం కుప్పలను కప్పి ఉంచిన రైతులు

అలసత్వం వహిస్తున్నారన్నారు. ప్రతి ఏడాది ఇదే కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నా, అధికారుల తీరు మారడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వర్షంతో ఆందోళన

అధికారుల తీరు ఇలా ఉండగా.. వాతావరణంలో జరుగుతున్న మార్పులు మరో సమస్యగా మారింది. ఉన్నట్టుండి ఈదురు గాలులు, వర్షం కురవడంతో ఎంత జాగ్రత్తపడినా ధాన్యం తడిసిపోతుందంటున్నారు. తేమ శాతంలో మార్పులు రాకుండా వ్యయ ప్రయాసలు పడుతున్నట్లు వాపోతున్నారు. మండలంలోని పెద్దధన్వాడ,రాజోళి,మాన్‌దొడ్డి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల దగ్గరకే సంచులను సర్దుబాటు చేయలేకపోతే ఎలా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. వచ్చిన సంచులు కూడా రాత్రి సమయంలో వస్తుండగా,వాటిని అర్ధరాత్రి సమయంలో రైతులకు ఇస్తుండటంతో అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

15 రోజులుగా ఇక్కడే

గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారనే సంతోషం కన్నా, ఇలా రోజుల తరబడి పడిగాపులు కావడం ఇబ్బందిగా ఉంటుంది. రాత్రి అయితే కుప్పలు పోసుకుని, ఉదయాన్నే ఆరబోసుకుంటున్నాం. నేటి వరకు మొత్తం ధాన్యం కొనగోళ్లు చేయడం లేదు.

– నర్సింగౌడ్, మాన్‌దొడ్డి

అందుబాటులో సంచులు

మండల పరిధిలోని ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో సంచులు కొరత ఉన్న విషయం ఉన్నతాధికారులకు తెలియజేశాం. గత శుక్రవారం రాత్రి సంచులు తెప్పించి అందజేశాం. ప్రస్తుతం లోడ్ చేస్తున్న వాటిని వీలైనంత త్వరగా మళ్లీ అందుబాటులోకి తెస్తాం.

– రవికుమార్, పీఏసీఎస్, సీఈఓ, రాజోళి

గుంతలు పూడ్చండి సారూ..



చెన్నిపాడులో రోడ్డుపై గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు గ్రామంలో పాఠశాలకు వెళ్లే దారిలో రోడ్డంతా గుంతలమయంగా దర్శనమిస్తుంది. గుంతల్లో నీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నట్లు పాదచారులు,వాహనాదారులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు

గద్వాల క్రైం: మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన ఏడుగురిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. సోమవారం రాత్రి పట్టణ శివారులో వాహనాల తనిఖీ నిర్వహించారు. తనిఖీలో మద్యం తాగి వాహనం నడుపుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఉపాధి కూలీలను ఆదుకోవాలి

ఆత్మకూర్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలను అన్నివిధాలుగా ఆదుకోవాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని బాలకిష్టాపూర్‌లో ఉపాధికూలీలతో సమావేశమయ్యారు. ఉపాధి పనుల చోట కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో కూలీలు ఎండకు తట్టుకోలేక అల్లాడిపోతున్నారని, కనీసం తాగునీరు సమకూర్చడంలో ఘోరంగా విఫలమయ్యారని ఆరోపించారు. 200 రోజులకు పనిదినాలకు పెంచాలని, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, ఉపాధి కూలీలకు రోజుకూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీలోని మేట్లను ఫీల్డ్ అసిస్టెంట్లుగా గుర్తించాలని కోరారు.

10న టీజీఎస్‌ఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష

ఎర్రవల్లి: తెలంగాణ గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు ఈనెల 10న టీజీఎస్‌ఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు మహబూబ్‌నగర్ టీజీఎస్‌ఆర్‌జేసీ సెట్–2025 కన్వీనర్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 35 గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ హాల్ టికెట్లను హెచ్‌టీటీ://టీజీఎస్‌ఆర్‌జేసీ.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు ఉంటుందన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందుగా చేరుకోవాలని పేర్కొన్నారు.

మట్టి టిప్పర్ పట్టివేత

ఉండవెల్లి: మండలంలోని పోతులపాడు నుంచి అలంపూర్ చౌరస్తాకు అనుమతులు లేకుండా టిప్పర్‌లో మట్టిని తరలిస్తుండగా బ్లూకోర్టు పోలీసులు ఖాదార్, రవీంద్ర పట్టుకున్నారు. టిప్పర్‌ను స్టేషన్‌కు తరలించి, టిప్పర్ డ్రైవర్ కర్నూల్‌కు చెందిన జింకల ప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తాం

సాక్షి ఎఫెక్ట్..



ఉండవెల్లిలో నీటి సమస్యపై వివరాలు తెలుసుకుంటున్న మిషన్ భగీరథ అధికారులు

ఉండవెల్లి: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తామని మిషన్ భగీరథ అధికారులు అన్నారు. మండలంలోని ఆయా 'గ్రామాల్లో తాగునీటి కష్టాలు' అనే కథనం సోమవారం సాక్షిలో ప్రచురితమవడంతో జిల్లా కలెక్టర్ బీఎస్ సంతోష్, మిషన్ భగీరథ ఈఈ(ఇంట్రా) అధికారి శ్రీధర్‌రెడ్డి స్పందిచారు. మండలంలోని పలు గ్రామాల్లో ఈనెల 28, 30వ తేదీల్లో సరఫరాలో అంతరాయం ఏర్పడినందున ప్రజలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తినట్లు తెలిపారు. కొన్ని గ్రామాల్లో ఫ్లో కంట్రోల్ వాల్వ్‌లు తొలగించడం వలన నీటి సరఫరాలో అంతరాయం జరుగుతుండడంతో వాల్వ్ తీసిన వారికి నోటీసులు అందజేసి జరిమానా విధిస్తామని మిషన్ భగీరథ ఈఈ శ్రీధర్ రెడ్డి డీపీఆర్‌ఓ ద్వారా సోమవారం వెల్లడించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ ఏఈ అర్షద్ కంచుపాడు, చిన్న ఆముదాలపాడు, ఉండవెల్లి గ్రామాల్లో పర్యటించి తాగునీటి సమస్య గురించి పరిశీలించారు. మిషన్ భగీరథ ఏఈ గ్రిడ్ అధికారికి సకాలంలో నీరు అందించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు బాషా, అనిష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

భూముల వివరాలు నమోదు చేయించుకోవాలి



దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎంఏఓ జనార్దన్

అయిజ: ప్రతి రైతు వారి వ్యవసాయ భూముల వివరాలు ఏఈఓలతో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి జనార్దన్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో రైతుల భూముల వివరాలు నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రైతుకు 11 నంబర్ల విశిష్ట సంఖ్య (యూనికోడ్)ని కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిపారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ ప్రాజెక్టు చేపట్టినట్లు జనార్దన్ పేర్కొన్నారు. భూమి ఉన్న ప్రతి రైతు భూములకు సంబంధించిన వివరాలతో కూడిన సమాచారంతో ఈ–ఫార్మర్ రిజిస్ట్రీ నిర్మించబడుతుందన్నారు. రెవెన్యూ శాఖ ద్వారా సేకరించిన భూ యాజమాన్య వివరాలకు రైతు ఆధార్ సంఖ్యను అనుసంధానం చేయడం ద్వారా ఈ–ఫార్మర్ ఐడీని కేటాయించనున్నట్లు తెలిపారు. రెవెన్యూ శాఖ వద్ద ఉన్న భూ యాజమాన్య వివరాలు ప్రామాణికంగా తీసుకొని రైతులకు ఐడీ కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, పీఎం కిసాన్ లబ్ధిదారులకు తదుపరి విడుత లబ్ధి పొందుటకు ప్రామాణికంగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి ఆధార్ కార్డు, భూ యాజమాన్య పాస్ పుస్తకం, ఆధార్‌కు లింక్ చేయబడిన మొబైల్ నంబర్ అందజేసి ఫార్మర్ ఐడీని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఎర్రవల్లి: సైబర్ మోసాలపై పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోదండాపురం ఎస్‌ఐ మురళి అన్నారు. సోమవారం మండల పరిధిలోని వేముల గ్రామంలో సామాజిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ మోసాలు, దొంగతనాలపై తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాత్రి సమయంలో ఆరు బయట, మేడలపై నిద్రించే వారు విలువైన వస్తువులు జాగ్రత్త పరుచుకోవాలన్నారు. యువత బెట్టింగులు, చెడు వ్యసనాల బారిన పడి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి



అమరచింతలో కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్లను అర్హులందరికీ మంజూరు చేయాలని ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు డాక్టర్ కృష్ణ అన్నారు. సోమవారం దరఖాస్తుదారులతో కలిసి మున్సిపల్ కమిషనర్ శశిధర్‌కు వినతి పత్రం అందజేశారు. పూరిగుడిసెల్లో, కిరాయి ఇళ్లల్లో ఏళ్లుగా నివాసముంటున్న వారికి కాకుండా సొంత ఇళ్లు ఉన్నవారి పేర్లే జాబితాలో పొందుపర్చారని ఆందోళన వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి అర్హులందరికీ న్యాయం చేయాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో..

అమరచింత: ఇందిరమ్మ ఇళ్లనను అర్హులైన నిరుపేదలకు ఇవ్వాలంటూ మున్సిపల్ కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈమేరకు మున్సిపల్ కమిషనర్‌తో వాగ్వాదానికి దిగారు. పట్టణంలోని 10 వార్డుల్లో నిరుపేదలు ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నారని, వార్డు ఆఫీసర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి కేవలం అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఇళ్లు మంజూరయ్యేలా లబ్ధిదారుల ఎంపిక చేశారని దుయ్యబట్టారు. పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం వేలలో అర్జీలు పెట్టుకున్నారని, కేవలం 100 ఇళ్లను మాత్రమే మున్సిపాలిటీకి మంజూరు చేయడం తగదన్నారు. మరోమారు విచారణ చేసి అర్హులైన పేదలకు ఇళ్లు కేటాయించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కమిషనర్‌కు అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నరసింహులుగౌడ్, మాజీ కౌన్సిలర్ రాజ్‌కుమార్, బాలరాజ్, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

'సార్వత్రిక సమ్మెలో పాల్గొంటాం'



కలెక్టర్ విజయేందిర బోయికి సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ/జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్)/భూత్పూర్: దేశవ్యాప్తంగా ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెలో మున్సిపల్, గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ, ఆశా, వీఓఏలు, హమాలీలు, భవన నిర్మాణ తదితర రంగాలకు చెందిన కార్మికులందరూ పాల్గొంటారని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయేందిర బోయిని కలిసి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లతో పాటు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలకు పెంచాలని, ప్రభుత్వ రంగాలను బలోపేతం చేయాలని, కార్మిక హక్కులు కాపాడాలన్నారు. ఈ సార్వత్రిక సమ్మెను సకల కార్మికులు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఆకుల వెంకటేష్, ఖమర్‌అలీ, ఎం.వెంకటేష్‌గౌడ్, నారాయణ, కృష్ణ, మహేష్ పాల్గొన్నారు.

✰ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో భూత్పూర్ మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్‌కు సమ్మె నోటీసు అందజేశారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కురుమూర్తి, వెంకటేష్, మహేష్, శ్రీనివాసులు, నర్సింహులు, మాసమ్మ, భారతమ్మ, నాగమణి పాల్గొన్నారు.

అయిజలో తాగునీరు కలుషితం

- స్వచ్ఛత లేని తాగునీరు
- దుర్వాసన వస్తున్న వైనం
- అవస్థలు పడుతున్న ప్రజలు



అయిజలో పీహెచ్‌సీ వద్ద ఏర్పాటు చేసిన ఓవర్ హెడ్ ట్యాంక్

అయిజ: మున్సిపాలిటీ ప్రజలు తాగునీటి కోసం తంటాలు పడుతున్నారు. వేసవిలో భూగర్భ జలాలు అడుగంటడంతో పాటు మిషన్ భగీరథ కుళాయిల నుంచి కొన్ని రోజులుగా మురుగు నీరు సరఫరా కావడంతో అల్లాడుతున్నారు. పట్టణంలో మూడు సంవత్సరాలుగా మిషన్ భగీరథ నీరు సరఫరా చేస్తున్నారు. ప్రారంభ దశలో కొత్త పైపులైన్ల నుంచి మురుగునీరు వచ్చేది. రెండు సంవత్సరాల పాటు స్వచ్ఛమైన నీరు వస్తోంది. మళ్లీ ఇప్పుడు మురుగు నీరు సరఫరా కావడంతో పట్టణ ప్రజలు తాగునీటి కోసం పడరానిపాట్లు పడుతున్నారు.

నీటి సరఫరాకు ఓవర్ హెడ్ ట్యాంకులు

పట్టణంలోని 20 వార్డులకు తాగునీటిని సరఫరా చేసేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తహసీల్దార్ కార్యాలయం, ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఆవరణల్లో ఓవర్ హెడ్ ట్యాంకులు ఏర్పాటు చేశారు. వాటితో పాటు గతంలో ఏర్పాటు చేసిన మినీ ఓవర్ హెడ్ ట్యాంకులను ఉపయోగిస్తున్నారు. తిక్క వీరేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని సంప్ వెల్‌ను ఉపయోగించుకుంటున్నారు. కొంత కాలంగా తాగునీరు స్వచ్ఛత లేకుండా బురదతో కూడి ముదురు రంగులో ఉండడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీటిలో మట్టి రేణువులు

మున్సిపాలిటీలోని గాజులపేట, భరత్ నగర్, టీచర్స్ కాలనీ, ఎస్సీ కాలనీ, మేకలపేట, రంగుపేట, కాళమ్మపేట, కురవపేట, గుర్రంతోట, బలిజపేట, దుర్గానగర్, మాలపేట, పాత బస్టాండ్, కొత్త బస్టాండ్ కాలనీల్లో ఇటీవల మట్టి రేణువలతో కూడిన నీరు సరఫరా అవుతుంది. దీంతో ఆయా తాగునీటి కోసం అల్లాడుతున్నారు. ప్రైవేటు వ్యక్తుల వద్ద ఫిల్టర్ నీరు విక్రయించి తాగాల్సి వస్తోందని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్య తీర్చాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.



కుళాయి ద్వారా వచ్చిన కలుషిత నీరు

డెడ్ స్టోరేజీకి చేరుకుంది..



జూరాల నుంచి సరఫరా చేసే మిషన్ భగీరథ నీరు ఇటీవల అపరిశుభ్రంగా ఉంటుందని ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు. నీటి నిల్వలు డెడ్ స్టోరేజీకి చేరుకోవడంతో నీరు అపరిశుభ్రంగా వస్తుంది. ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేసి ప్రజలు ఇబ్బంది పడకుండా చూస్తాం.

–సీహెచ్ సైదులు, మున్సిపల్ కమిషనర్

దుర్వాసన వస్తుంది



భగీరథ పైపులైన్ల నుంచి వస్తున్న తాగునీరు దుర్వాసన వెదజల్లుతుంది. కుళాయి నుంచి వచ్చిన నీటిని కాచి చల్లార్చి తాగాల్సి వస్తుంది. దీంతో రోగాల బారిన పడుతున్నాం. మున్సిపాలిటీలో స్వచ్ఛమైన తాగునీరు కల్పించడంపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

– నజీర్, అయిజ

మట్టిరేణువులు వస్తున్నాయి



మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి సరఫరా చేస్తున్న తాగునీరు కలుషితమవుతోంది. నీటిలో మట్టి రేణువులు ఉన్నాయి. స్వచ్ఛత లేని నీటిని తాగలేక పోతున్నాం. టీడీఎస్ పరికరంతో నీటిని పరిశీలిస్తే 600కు పైగా నంబర్ కనపడుతోంది.

–రవీంద్రనాథరెడ్డి, అయిజ

క్లోరినేషన్ చేయాలి



తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలి. తరుచూ నీటిలో బ్లీచింగ్ పౌడర్ కలపడం వలన బ్లీచింగ్ వాసన వస్తోంది. అధికారులు ఎప్పటికప్పుడు ట్యాంక్‌లను పరిశీలించాలి. స్వచ్ఛమైన తాగునీటిని మున్సిపాలిటీలో సరఫరా చేయాలి.

–మహబూబ్, అయిజ